What to write
When even the meaning
Of the words "**you**" and "**I**"
Have been lost
And the stories of both along with them?

I thank you for your gentleness
And profound patience
I thank you for reminding me
Of what I love the most

Om Guru Nanna Ki Jai!

- **Ram Charan**

Dark One,

Take this girl for your servant -
Then cut the cords and set her free....

To You, Nannaji, by all your names -- Krishna, Govinda, Rama --
whichever one you please --
Yet nameless, formless, forever present as the Heart.
This is my request: Let me never forget you and always be in You.
Thank you -- thank you for All that you are, forever mine as I am forever yours.
In your Love & Grace


Yourself as
**Shivani**





ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 8 సంచిక : 8 పుష్పం : 19-21 05-01-2003

**RAMANA BHASKARA**
**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**
PAGES : 24

**VOL : 8** **ISSUE : 08**

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 224589, 224689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 222438, 221260

## కాలస్వరూపుడను గౌరవిస్తే, కాలాతీత స్థితికి చేరుతాము

మనకు జనన మరణాలల్లో దాగిఉన్న దుఃఖం తెలియటంలేదు. అందుకే కాలానికి అతీతమైన "సత్యాన్ని" దర్శించాలనే కాంక్ష కలగటంలేదు. నిజభక్తుడికి కాలం సరిపోదు. కాలాన్ని అవమానిస్తే భగవంతుడిని అవమానించినట్లే, కారణం కాలస్వరూపంగా ఉన్నది ఆయనే కాబట్టి. "సకల సౌకర్యాలు ఉండి ఆత్మసాధన చేయలేనివారు వ్యర్థులు, వెట్టికోరికలు, వెట్టితలంపులను, సాకులను సృష్టించుకోవటం మహా అనర్థకరము" అన్నారు వివేకానంద. ఆధ్యాత్మికఅభివృద్ధికి నియమబద్ధమైన జీవితం ఎంతో కావాలి. మానవ జీవితకాలంలో 30% నిద్రలోనే గడచిపోతున్నది. ఆ సమయంలోనే అహంకారం మనలను విడిచిపెడుతున్నది. మిగిలిన కాలమంతా అహంకారంతోనే మనం కాపురం ఉంటున్నాము. జరిగిపోయిన సంఘటనలు, భవిష్యత్తును

**ఈ సంచికలో......** **సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**

08-12-02 నర్సాపురం .......... 3
03-12-02 మురమళ్ళ .......... 12
16-12-02 చించినాడ .......... 19

**Visit us @ www.srinannagaru.com**

గురించి ఆలోచనలే గాని, వర్తమానంలో ఉండము. తర్కబద్ధమైన సొంతఆలోచనగా, ఒక వ్యక్తి ఆలోచనావిదానం మారాలంటే దానికి సుదీర్ఘశ్రమ అవసరం. వ్యర్థమైన మాటలు, పనులు, క్షుద్రసాహిత్యం చదవటం వల్ల అవి మనలను అధోగతికి తీసుకొని వెళుతుంది. మనకు సత్‌పురుషులు దొరకకపోతే, ప్రశాంతత లేకపోతే సముద్రాన్ని లేదా ఆకాశాన్ని చూస్తూ, నేను ఎందుకు జీవిస్తున్నాను, నేను ఎవడను? నేను ఎలా జీవించాలి? అని అర్థంచేసుకోవాలి. “చీకటి గృహలో పామైయుండటం, మరుభూమిలో కుంటి లేడై ఉండటం, శిలలయందు కీటకమైఉండటం మేలేగాని పామరులతో సాంగత్యం ఎంతమాత్రం మంచిది కాదు” అంటున్నది యోగవాసిష్ఠము. ఉన్నతమైన ఆలోచన అధ్యయనం అవసరం. అవసరానికి మించిన కోరికలు అజ్ఞానాన్ని పెంచి పోషిస్తాయి. నియమించుకొన్న మనస్సు అంతర్ముఖమై చివరికి నాశనమౌతుంది. తపస్సు, సత్‌పురుషుల సాంగత్యం అవసరం. శ్రీనాన్నగారు అంటారు “జపంచేసి, పూజచేసి ముగ్గాలి కాని కుళ్ళిపోకూడదు”. అంటే సాధకుడు ఎఱుకకలిగి ఉండాలి గాఢనిద్రలో కూడా సాధన సాగాలి. ప్రారబ్దం ప్రశాంతంగా సాగుతున్న రోజులలోనే కాలాన్ని ఎక్కువగా కాపాడుకోవాలి. శరీరం రోగగ్రస్తమై, భౌతికవత్తిడులకు లోనైతే సాధన సాగదు, వృద్ధాప్యం బానిసత్వాన్ని తెచ్చిపెడుతుంది. రోజులు వెళ్ళబుచ్చుకోవాలని అనిపిస్తుంది. మానవుడు తనలోని దోషాలను ఒక్కటీ చెప్పడు యితరుల దోషాలను లెక్కపెడతాడు. ఆ లెక్కపెట్టేటైము అతనికి దొరకకూడదు. సాధన ఆ దిశగా సాగాలి” అన్నారు. మనకు రోజులు బాగా వెళ్ళిపోతున్నాయి అని అనుకొంటాము – గొర్రెను కసాయివాడు నరకటానికి తీసుకొని వెళుతున్నట్లుగా మరణం దిశగా మనం ప్రయాణం చేస్తున్నామని గుర్తుంచుకోవాలి, ప్రతీరోజు రాత్రి పడుకొనేటప్పుడు యిలా ఆలోచించాలి, ఎన్నిసార్లు నోరుజారాము, ఎంతవరకూ చెడుతలంపులల్లోంచి బైటపడ్డాము, ఎంతఅభివృద్ధిపొందామని ఆలోచించాలి. “ఆత్మానుభవంకన్నా ఆ అనుభవంపొందటానికి సాధన చేసేకాలాన్ని ఆసాధనాస్థితి చాలా గొప్పదిగా భావించు” అన్నారు గాంధీజీ. మనకు కాలక్షేపం అవ్వక రోడ్డుమీద గొడవలు పోగుచేసుకొంటే దానివల్ల కలహం అనే అగ్ని పుడుతుంది. మనకు రాగద్వేషాలే లేకపోతే మనస్సు బాహ్యాముఖం అవ్వదు. చింతా,బెంగా పోగొట్టే ఆనందస్థానం మనలోనే ఉంది దానిలో మనం ప్రవేశించాలి. మనస్సు అణిగితే, కాలంలేదు. నిద్రలో కాలంలేదు, ఆ నిద్రాస్థితిని ఎఱుకలో పొందటమే జీవితలక్ష్యం.

– సాగిరాజు రామకృష్ణంరాజు,
అర్ధవరం.



1A

**సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 8-12-2002, నర్సాపురం**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం సత్యాన్వేషకులుగా ఉండాలి, అంతేగాని ఆభగవంతుడు ఎక్కువ, ఆదేవతాస్వరూపుడు ఎక్కువ అని అనుకొంటూ ఉంటే కాలం, శక్తి వృధాఅవుతాయి. సత్యాన్వేషకులకు గాని సత్యానుభవం కలుగదు. మనం వివేకం, బుద్ధిసూక్ష్మత పెంచుకోవాలి. వివేకం, బుద్ధిసూక్ష్మత పెరిగేకొలది మానసికవత్తిడి తగ్గుతుంది. మానసికవత్తిడి ఎప్పుడైతే తగ్గిందో అది శారీరకఆరోగ్యానికి, మానసికఆరోగ్యానికి మంచిది. మనం చేసేపని కూల్‌గా, క్వైట్‌గా, నిదానంగా చేయాలి. ఫలితంకోసం ఎదురుచూడవద్దు. ఫలితంకోసం ఎదురు చూస్తే మనస్సు అపవిత్రం అవుతుంది. జీవితంలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి, అనేకమంది వ్యక్తులు అనేకరకాలుగా ఉంటారు. ఈ చిన్నచిన్న విషయాలు పట్టుకొని మనం కాలాన్ని, శక్తిని వృధాచేసుకోకూడదు. వారి హృదయంలో ఏమిఉందో తెలుసుకోవటం మానివేసి, వ్యక్తుల గురించి ఎక్కువగా మాట్లాడేవారిని వారు చాలా లిటిల్‌మైండ్స్ అని స్వామిచిన్మయానంద అనేవారు. జీవితంలో అనేకసంఘటనలు జరుగుతూఉంటాయి, వాటిని సీరియస్‌గా తీసుకోకూడదు. దేహప్రారబ్ధమును బట్టి అలా జరుగుతాయి, నీవు తీర్పులు చెప్పవద్దు, నీవు సాధకుడవు, నీ పరిమితులు మర్చిపోవద్దు. జడ్జిమెంట్ ఈశ్వరుడు చెపుతాడు. చిన్నచిన్న సంఘటనలను దృష్టిలో పెట్టుకొంటే నీకు గ్రేట్ అయిడియాస్, నోబుల్ థాట్స్ రావు, గ్రేట్ మైండ్‌కు దూరమవుతావు. లిటిల్ మైండ్స్‌కు సత్యాన్ని గ్రహించే అవకాశం

# గురు సాంగత్యం

**గురు సాంగత్యం బాహిరము, ఆంతరము కూడ,**
**ప్రత్యక్ష గురు సాంగత్యం మనస్సును బయటినుంచి లోపలికి నెట్టుతుంది.**
**గురువే సాధకుని హృదయంలో గూడ ఉన్నాడు.**
**కనుక అంతర్ముఖం కాజొచ్చిన అతని మనస్సును ఆయన లోపలినుండి**
**హృదయంలోకి లాక్కుంటాడు**

లేదు. ఆధ్యాత్మికవిషయాలే కాదు, లౌకికవిషయాలు కూడా మనం ప్రశాంతంగా చేసుకొంటూ ఉండాలి. ప్రతీ చిన్నవిషయానికి ఉద్రేకపడుతూ ఉంటే లోపలఉన్న సత్యానికి, శాంతికి దూరమవుతాము. మనం నెమ్మదిగా వెళ్ళినా సరియైన మార్గంలో వెళ్ళాలి. మనం అందరం దేహానికి పరిమితమై ఉన్నాము. కులాలు, మతాలు అని మనుషులను వేరుచేస్తున్నాము. ఇలా చిన్నచిన్న విషయాలగురించి ఆలోచిస్తూ కాలాన్ని పాడుచేసుకొంటున్నాము. సత్యాన్వేషకులకు ఇవి ఏమీ అవసరం లేదు. మోక్షం ఎప్పుడు వస్తుందని కనిపెట్టుకొని ఉండవద్దు. అది నిర్ణయించేది ఈశ్వరుడు. మనం దానికోసం ఎదురుచూసినట్లు ఉండకూడదు. ఏదో ఒక గంటసాధనకు కేటాయించటం కాకుండా మన దైనందినజీవితాన్ని సాధన క్రిందమార్చుకోవాలి. అంటే మన మాట,చేత ఎలా ఉన్నాయి, మన మనస్సు, మాట, చేత ఒకటిగా ఉన్నాయా, లేదా అనిచూసుకొంటూ వాటిని ఒకటిగా చేసుకొని, మొత్తం దైనందిన జీవితాన్ని సాధనక్రింద మార్చుకొంటే మోక్షం కలుగుతుంది. మనకు లోపల ఉద్రేకాలు, రాగద్వేషాలు చాలా ఉంటాయి, కాని అవి మనలో ఉన్నాయి అవి మనకు తెలియదు. అవి ఉన్నాయి అని మనకు తెలియజేసే సంఘటనలను పరమేశ్వరుడు క్రియేట్ చేస్తాడు. మనలోఉన్నబలహీనతలు మనకు తెలియకుండా వాటిలోనుండి మనం బయటకు రాలేము. నీ బలహీనతలు ఏమిటో నీకు తెలియజేసి, వాటిలోనుండి విడుదలపొందటానికి నీకు సద్బుద్ధిని, సహృదయాన్ని కలుగజేస్తాడు. సాధనచేసేబుద్ధిని నీకు కలుగజేసి, నీచేత సాధన చేయించి, వాటిలో నుండి నిన్ను విడుదల చేస్తాడు, వాడు ఈశ్వరుడు.

మనకు సత్యంయందు గౌరవంలేదు, పెద్దలయందు గౌరవంలేదు, సత్యానుభవం పొందిన వారి మీద గౌరవంలేదు. కాని అది తెలియబడాలి అని అనుకొంటున్నాము. అలా అనుకొన్నంతమాత్రం చేత అది తెలియబడదు. మన యోగ్యత చూడకుండా, అర్హత చూడకుండా పరమేశ్వరుడు ఎఱుకలోనికి రాడు, మనకు అర్హత కలిగినప్పడు పరమేశ్వరుడు ఎఱుకపడతాడు, మనం ఆయనను మోసంచేయలేము. గుడిలో దేవుడు ఉన్నాడు, మసీదులో దేవుడు ఉన్నాడు, చర్చిలో దేవుడు ఉన్నాడు అని మనం అనుకొంటున్నాము. దేవుడు అంతటఉన్నాడు అని తెలియజేయటానికి వచ్చిన అవతారమే నరశింహావతారము. దేవుడు అంతటా ఉన్నాడు అనే బుద్ధి మనకు కలగటంలేదు ఎందుచేతనంటే మనం దేహానికి పరిమితమై ఉన్నాము. హృదయంలో నీవు ఎలాగ ఉన్నావు అంటే రూపరహితుడవు, నామ రహితుడువుగానే ఉన్నావు. మనస్సు వచ్చేటప్పటికి, దేహంతో





తాదాప్యం వచ్చేటప్పటికి దేహం లోపల నేను ఉన్నాను, నాకు బయట ప్రపంచం ఉంది, ఎక్కడో దేవుడు ఉన్నాడు అని బేధబుద్ధి వచ్చేస్తోంది. ఆ బేధబుద్దే మన అశాంతికి కారణం. మనం హద్దులు ఏర్పరచుకొన్నాము కాబట్టి దేవుడికి కూడా హద్దులు ఏర్పాటుచేస్తున్నాము, గుడిలో ఉన్నాడు, మసీదులో ఉన్నాడు అని ఇలా పరిమితులు కల్పిస్తున్నాము. ఒకచోట ఉంది, వేరొకచోట లేకపోతే వాడు దేవుడే కాదు. నిజమైనదేవుడు నీ హృదయంలోనే ఉన్నాడు. ఒకడు బంగారు పళ్ళెం చేతిలో పెట్టుకొని బిక్ష చేసుకొంటున్నాడు, అది బంగారుపళ్ళెం అని వాడికి తెలియదు. అది బంగారు పళ్ళెం అని వాడికి తెలిస్తే బిక్షకు వెళ్ళడు. తరువాత ఎవరో చెపుతారు నీవు ఎందుకు బిక్షకు వెళ్ళటం, నీ చేతిలో ఉన్నది బంగారుపళ్ళెం అని చెపుతారు. అలాగే సుఖం మన హృదయంలో ఉన్నప్పటికి అది తెలియక సుఖంకోసం బజారులో వెతుక్కొంటున్నాము. బాహ్యసంఘటనల వలన వచ్చే సుఖం అంతాకూడా పరిణామంలో దుఃఖంగా మారిపోతుంది. ఇది బాగా గుర్తుపెట్టుకోండి. మీ శత్రువులకు అపకారం జరిగింది అనుకోండి దానివలన మీకు సంతోషం వచ్చింది అనుకోండి మీరు సాధకులు కాదు అని అర్ధం. కొంతమందికి భౌతికజీవితమే ఉంటుంది కాని మానసికజీవితం ఉండదు, మానసికజీవితమే లేనివాడికి ఆధ్యాత్మికజీవితం ఏమిటి?

మంచిచేయటం కంటే మంచిగా ఉండటం కష్టం అని స్వామి శివానంద చెప్పారు. మంచిగా ఉండటం వలన మీకు సత్యానుభవం కలుగుతుంది. జగత్తు, జీవుడు, ఈశ్వరుడు మనోకల్పితం అని అంటేఈశ్వరుడు మీద గౌరవం లేదు అని కాదు నిజం దగ్గరకు తీసుకొని వెళ్ళటానికి చెప్పారు. నిజం దగ్గరకు వెళితేగాని మనకు స్వేచ్ఛలేదు. అద్వైతసంస్కారం లేనప్పడు ఈ మాటలు భరించలేరు. దేహభావన తగ్గించుకోలేక, దానిలోనుండి విడుదల పొందలేక మనకు అనేక వికారములు, గొడవలు వస్తున్నాయి. జీవితం అంతా తలంపులే అన్ని తలంపులకు దేహమునేను అనే తలంపే కారణం, అదే మూలతలంపు. ఆ మూల తలంపు మూలంలోనే భగవంతుడు ఉన్నాడు. అక్కడకు చేరటానికి మనకు వైరాగ్యంలేదు, అభ్యాసం లేదు. మనకు ఉండవలసినంత వైరాగ్యంలేదు. అందుచేత మనకు లోచూపు కలగటంలేదు. ఇతరుల గుర్తింపుకోసం పనులు చేయవద్దు. ఇతరుల గుర్తింపుకోసం పనులు చేస్తూఉంటే మూలతలంపు పెరుగుతుంది. మిమ్మల్ని ఎవరైనా పొగిడితే మీకు సంతోషంవస్తూఉంటే అదోరకమైన వికారం, మిమ్మల్ని ఎవరైనా విమర్శిస్తూ ఉంటే మీకు దుఃఖంవస్తూఉంటే అదోరకమైన వికారం. ఈ వికారములు పెరుగుతూ ఉంటే

మూలతలంపు పెరుగుతూ ఉంటుంది. మనం ఏదైనా మంచిపనిచేసినా కృతజ్ఞత ఆశించకూడదు, కృతజ్ఞత చూపించాలి అనుకొంటే మూలతలంపు పెరిగిపోతుంది. మనకు సత్వగుణం లేకపోతే మన హృదయంలో ఉన్న సత్యం మనకు అందదు. నిరంతరం భగవంతుని సేవించటంవలన, భగవంతుని యందు పరిపూర్ణమైన విశ్వాసం కలిగి ఉండటం వలన మనకు సత్వగుణం కలుగుతుంది. పరమేశ్వరుని యందు భక్తి లేకపోతే, గౌరవం లేకపోతే మనకు సత్వగుణం రాదు. భగవంతుడికి రూపంలేదు, నామంలేదు. ఆయన ఒకరూపంతో, నామంతో రావచ్చు అంతమాత్రం చేత ఆయనను వాటికి పరిమితంచేయకూడదు. రూపబుద్ధి, నామబుద్ధి ఎంతవరకు తగ్గించుకొంటే అంతవరకు మనం హృదయం యొక్క లోతులలోనికి వెళ్ళగలుగుతాము. సౌందర్యం మన హృదయంలోనే ఉంది. దానిని దర్శించటానికి మనకు లోచూపులేదు, లోపలఉన్న వస్తువు మీద విశ్వాసం లేదు, మనం విశ్వాసహీనులము ఇంక దానిని ఎలా పొందగలము. మూలతలంపును దాని మూలంలోనికి ఉపసంహరించుకొంటూ వెళ్ళాలి, మూలతలంపు మూలంలోనికి వెళ్ళటానికి అభ్యాసం కావాలి, వైరాగ్యం కావాలి, కృషి కావాలి, ఈశ్వరుని కృపకావాలి. ఎవరినైతే పొందాలి అనుకొంటున్నామో వారి దయలేకుండా వారిని పొందలేము. మూలతలంపు మూలంలోనికి వెళ్ళకుండా నేను దేవుడిని చేసాను అంటే నీ మనస్సు ఎంతనిజమో, నీకు కనిపించే దేవుడు కూడా అంతే నిజం. ఇవి అన్నీ పాక్షికసత్యాలు మాత్రమే.

మన బుద్ధి సరిగా ఉంటే బాగాసాధన చేయాలి, తరించాలి అనే తలంపులు వస్తాయి. ఏదో ఒక గంట పూజ చేసాను, జపం చేసాను, ధ్యానం చేసాను అంటే సరిపోదు, జీవితం అంతా సాధన క్రింద మార్చుకోవాలి. మనకు తూకం చాలా తక్కువ, ఎవరైనా చిన్నమాట అంటే భరించలేము, దీని వలన మూలతలంపు పెరిగిపోతుంది. మూలతలంపు ఉంటే అన్నీ ఉన్నాయి, అది లేకపోతే ఏదీలేదు. మూలతలంపును తీసివేస్తే నీవు ఎవరిగా ఉన్నావో అది నీకు అనుభవంలోనికి వస్తుంది. నీవు ఎవరో నీకు తెలిసేవరకూ ఏదోరకమైన భయం నిన్ను వెంటాడుతూ ఉంటుంది. సత్యానుభవం పొందేవరకు నీవు భయరహితస్థితిని పొందే అవకాశం లేదు. నీవు జాగ్రత్తగా ఉండాలి, ఏక్షణానికి ఆక్షణం వివేకం కాపాడుకొంటూ రావాలి. సహనం లేకపోతే నీవు లోపలకు వెళ్ళలేవు, నీకు సత్యానుభవం కలుగదు. శివుడు కంటే విష్ణువు ఎక్కువ, విష్ణువు కంటే శివుడు ఎక్కువ అని ఆ గందరగోళంలోనికి వెళ్ళవద్దు,





దాని వలన మనస్సు కలుషితం అవుతుంది. నీకు శాంతిలేనప్పుడు, నీకు ఆనందం లేనప్పుడు ఏ దేవుడు గొప్పవాడు అయితే నీకు ఏమిటి? మీరు సత్యాన్వేషకులుగా ఉండండి. దానికోసం ఏదో ఒక మహాత్ముడిని సపోర్టుగా తీసుకోండి. మీకు సత్యం తెలియకపోయినా గురువుకు తెలుస్తుంది. మీకు సత్యానుభవం కలిగే వరకూ గురువు మిమ్మల్ని విడిచిపెట్టడు. మనం దేనినైతే పోగొట్టుకోవాలి అనుకొంటున్నామో దానిని అలంకరించవద్దు, మూలతలంపును ముస్తాబు చేయవద్దు. మూలతలంపు మూలంలోనే బ్రహ్మం ఉంది. మనం చేసే సాధన అంతా అక్కడే గురిపెట్టాలి. యుద్ధభూమిలో గీత చెప్పటం ఏమిటి, అది కల్పితం ఏమో అని కొంతమంది లౌకికులు అంటారు. కృష్ణుడు భగవంతుడు కాబట్టి యుద్ధభూమిలో భగవద్గీతను చెప్పగలిగాడు. వివేకానంద ఏమి చెప్పాడు అంటే ఒక అజ్ఞాని ఎప్పుడూ జ్ఞానిని అర్థం చేసుకోలేడు. ఒక వేళ అర్థంచేసుకోవటానికి ప్రయత్నంచేసినా వీడి అజ్ఞానాన్ని తీసుకొని వెళ్ళి జ్ఞానియందు ఆరోపిస్తాడు. కృష్ణుడు నేను అంటే అది దేహానికి పరిమితమైన నేనుకాదు, అది విశాలమైన నేను, సృష్టి అంతా వ్యాపించిన నేను. మనం అనే నేను దేహానికి పరిమితమైనది. నన్ను స్మరించండి నన్ను ఆశ్రయించండి, మీ బుద్ధిని, మనస్సును నా యందు పెట్టండి అప్పుడు నాయందు ప్రవేశిస్తారు అని కృష్ణుడు చెపితే ఆ నేనుదేహానికి పరిమితమైన నేనుకాదు, మనోగతమైన నేనుకాదు, అది సృష్టి అంతా వ్యాపించిన నేను. మనం రోజుకు అనేక అవతారాలు ఎత్తుతాము. ఇంటిదగ్గర ఒకలాగ ఉంటాము. ఆఫీసులో ఒకలాగ ఉంటాము. ఇల్లు మన స్వంతం, ఆఫీసు ఎవరిదో అది ఏమైనా ఫరవాలేదు అనుకొంటాము. మనకు ఎంతసేపు దేహం, ఇల్లు ఇవేమనవి, ఇంకేమీ మనవికాదు. ఇటువంటి మనకుజ్ఞానమా? మనం భగవంతుడిని మోసం చేయలేము. చట్టాల వలన మనిషి బుద్ధిమంతుడు అవ్వలేడు. సత్పురుషుల సహవాసం వలన, సద్గ్రంధపఠనం వలన, సాధన వలన మనిషి బుద్ధిమంతుడు అవ్వాలి. తోటిమానవుడి మీద మనకు ప్రేమలేదు, ఇంక భగవంతుడి మీద ప్రేమ ఎలా కలుగుతుంది. హ్యూమన్‌లవ్ లేనివాడికి డివైన్‌లవ్ ఏమిటి? సత్యానుభవం కలిగిన మరుక్షణంలో ఆదేహం పోతుంది అని కొంతమంది చెపుతారు. అది నిజంకాదు. అలా అయితే మనకు సత్యం గురించి చెప్పేవారు ఎవరు? సత్యానికి దేహానికి విరోధం ఉందా? సత్యానికి దేనితోనూ విరోధం లేదు. అంతాతానే. ఆచార్యులవారు ఏమి అన్నారు అంటే భగవంతుడు లేడు అని జీవించటం కంటే భగవంతుడు ఉన్నాడు అని జీవించటం మంచిది. భగవంతుడు ఉన్నాడు అని జీవిస్తారు అనుకోండి ఒకవేళ భగవంతుడు లేకపోయినా ఇబ్బందిలేదు, భగవంతుడు లేడు అని జీవిస్తారు

అనుకోండి మరణానంతరజీవితంలో భగవంతుడు తారసపడితే మీ పరిస్థితి ఏమిటి, మీరు ఇబ్బందిలో పడతారు, దేవుడు ఉన్నాడు అని చెప్పినా, దేవుడు లేడు అని చెప్పినా నేనుఅనే మూలతలంపే చెపుతుంది. మూలతలంపు మూలంలోనికి వెళ్ళేవరకు దేవుడు గురించి నీకు తెలియదు.

ముందు శరణాగతి చెందు. శరణాగతి చెందే కొలది కోరికలు తగ్గుతాయి. కోరికలు తగ్గేకొలది భయాలు తగ్గుతాయి. భగవంతుని పాదాలే మనకు గతి అయితే, భగవంతుని యందు పూర్ణశరణాగతి ఉంటే మనస్సు అరెస్ట్ అయిపోతుంది. దైనందినజీవితంలో మనప్రవర్తనను గాలికి వదిలేసి, ధ్యానంవలన దేవుని పట్టేయాలి అని చూస్తున్నారు. ఈశ్వరునికి తెలియకుండా ఏ సంఘటన జరగదు. ఆయన అంతర్యామిగా ఉన్నాడు, ఆయనకు తెలియకుండా ఏమీ జరగటం లేదు. ఆడించేవాడు ఆయన, ఆడేవారము మనము. భగవంతుని పట్ల సజీవమైన విశ్వాసం వలన మూలతలంపు దానిమూలంలోనికి వెళుతుంది. ఈలోకంఉంది అని చెప్పేవాడవు, లోకంలేదు అని చెప్పేవాడవు నీవే. భగవంతుడు ఉన్నాడు అని చెప్పేవాడవు, భగవంతుడు లేడు అని చెప్పేవాడవు నీవే. ఈ మాటలు అన్నీచెప్పేనేను ఎవరు? అది తెలియకుండా నీవు జననమరణచక్రం నుండి విడుదల పొందలేవు. నీకు బయటచూపు ఉంది కాబట్టి ఇతరులలోపాలు కనిపిస్తున్నాయి. నీకు లోచూపులేదు కాబట్టినీలోఉన్న లోపాలు నీకు కనబడటంలేదు. ఇతరులలోపాలు కనిపెట్టటం వలన నీకు ప్రయోజనం ఏమీలేదు. నీ లోపాలు ఏమిటో తెలుసుకొని వాటిలోనుండి విడుదల పొందటానికి ప్రయత్నం చెయ్యి, అదే సాధన. బ్రహ్మంకు భిన్నంగా వ్యక్తి అంటూ ఎవడూ లేడు. బ్రహ్మంలేకుండా వీడు ఉన్నాడా? నీవు బ్రహ్మంకు భిన్నంగా ఉన్నాను అని అనుకొంటూ ఉంటే ఆ అనుకొనేది ఎవరో చూడు. వాడిని విచారణ చెయ్యి. రామకృష్ణుడు గోడమీద కూర్చొన్నాడు. ఒక ప్రక్క పరతత్వం, ఒక ప్రక్క లోకం అటు చూస్తున్నాడు, ఇటు చెపుతున్నాడు. అటువెళ్ళి కలిసిపోతే మనకు చెప్పేవాడే ఉండడు. రామకృష్ణుడు పెద్దపండితుడు కాదు, అయినా ఆయన మాటకు అంత పవిత్రత ఎందుకు వచ్చింది అంటే రామకృష్ణుడికి విషయబుద్ధిలేదు. విషయబుద్ధి ఉంటే కపటం ఉంటుంది కాని విషయబుద్ధి లేకపోతే కపటంలేదు. కపటం లేకపోవటం వలన ఆయన మాటలకు అంత విలువ వచ్చింది. మనకు వివేకం లేదు, విచారణ లేదు, విచక్షణ లేదు. ఏదో కొద్దిసేపు గుడికి వెళ్ళి కూర్చోవటం మోక్షం ఎప్పుడు వస్తుంది అని ఎదురుచూడటం. మన





మనస్సులో ఎంత డస్ట్ ఉన్నా మనకు మోక్షం వచ్చేయాలి. ఇక భౌతికంగా చూస్తే ఉదయం ఏదో పని చేయటం, మధ్యాహ్నానికి ఫలితం వచ్చేయాలి. వెయిటింగ్ అలవాటులేదు. ఇలా ఉంది మన పరిస్థితి. ఇంక సత్యానుభవం ఎలా కలుగుతుంది. మనకు సహనం తగ్గిపోయింది. మనిషి మీద మనిషికి గౌరవం తగ్గిపోయింది. మనం చెరువులో నీరు లాగ ఉండకూడదు. కాలువలో నీరులాగ ఉండాలి, ఎప్పుడూ ప్రవహిస్తూ ఉండాలి. వచ్చేది వస్తూ ఉండాలి, పోయేది పోతూ ఉండాలి. ప్రవాహం ఉంటేనే సమాజం బాగుపడుతుంది.

రమణస్వామి చెప్పేది ఏమిటి అంటే మనస్సుకు లోచూపు కలిగితే హృదయాభిముఖంగా ప్రయాణం చేస్తూఉంటే తరువాత నీవు చేయవలసింది ఏమీలేదు. హృదయమే నీ మనస్సును లోపలకు గుంజుకుంటుంది. అప్పుడు మనస్సు నశిస్తుంది. మనస్సు పోతే నీవు పోవు, నీవు ఏదిగా ఉన్నావో అది నీకు తెలియబడుతుంది. నీలోపల సత్యం ఉంది. అది నీకు తెలిసినా ఉంది, తెలియకపోయినా ఉంది. అది తెలిస్తే సుఖం, తెలియకపోతే జన్మజన్మలకు దుఃఖం నిన్ను వెంటాడుతుంది. రాగద్వేషములు తగ్గించుకొనే కొలది నీవు లోపలకు వెళతావు, అప్పుడు నీవు ఆగాలన్నా ఆగలేవు. అప్పుడు లోపలఉన్న శక్తి నిన్ను లోపలకు గుంజుకొని దాని స్వరూపాన్ని నీకు ఇస్తుంది. అప్పుడు నీకు ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా శాంతే, అంతా నీవే. మరణం అంటే అందరకూ భయం ఎందుకు అంటే మరణం తరువాత దేహం కనబడదు అని. మరి నీకు నిద్రలో దేహం కనబడుతోందా? లోకం కనబడుతోందా? నిద్రలో నీకు ఇవి ఏమీ కనబడటం లేదు. అయినా నీవు నిద్రను ఎందుకు కోరుకొంటున్నావు? ఎందుచేతనంటే నిద్రలో నీవు నీ ఇంటికి వెళ్ళిపోతున్నావు, అదే నీ నిజమైన ఇల్లు.

నీవు క్వైట్‌గా ఉండు, కూల్‌గా ఉండు, మాటలు తగ్గించుకో, తలంపులు తగ్గించుకో, గుర్తింపులు కోరవద్దు. ప్రపంచం మంచిదా, చెడ్డదా అని ఆగొడవ వద్దు. ప్రపంచం ఉంది, మనం ట్రైనింగ్ పొందటానికి ఇక్కడకు వచ్చాము అంతే. ప్రపంచం మంచిది అని చెప్పినా, చెడ్డది అని చెప్పినా ఇవి అన్నీ దొంగనేను చెప్పే మాటలే. నీకు శరణాగతి ఎప్పుడైతే వచ్చిందో కంట్రోలు చేసుకోవటానికి మనస్సు అంటూ ఏదీలేదు. పూర్ణశరణాగతిలో నీకు నిశ్చలత్వం వచ్చేస్తుంది. మీరు ఏ మతస్థులయినా, ఏ కులస్థులయినా, ఎన్నిదేవాలయాల చుట్టూ తిరిగినా, ఎన్ని సాధనలు చేసినా ఈ బుద్ధి ఉంది చూసారా అది మనలోపలఉన్న

సత్యాన్ని గ్రహించేవరకూ దాని చలనం ఆగదు. అధ్యయనం కంటే, జపధ్యానాల కంటే హోలీకంపెనీ అత్యంతముఖ్యమైనది, వారి వైబ్రేషన్స్ మనమీద పనిచేస్తాయి. సత్పురుషుల సహవాసం వలన మన హృదయంలో ఏదో ఉంది, దానిని తెలుసుకోవాలనే తపన మనకు కలుగుతుంది. హృదయం ఖాళీ అయ్యేవరకు ఎవడికి ఆత్మజ్ఞానం కలిగే అవకాశం లేదు. ముందు హృదయం ఖాళీ అవ్వాలి. ఎన్ని సాధనలు చేసినా హృదయం ఖాళీ అవ్వకపోతే జ్ఞానం కలుగదు. ఎవరితోనూ విరోధాలు పెట్టుకోవద్దు. దానివలన మనస్సుబాహ్యాముఖానికి పోతుంది. ఎవరితోనూ అతిగా స్నేహం చేయవద్దు. దానివలన కూడా మనస్సు బాహ్యాముఖానికి పోతుంది. మనస్సులో ఏమీ కోరికలు లేకుండా భగవంతుడిని భగవంతుడికోసమే పూజించే వారు ఎంతమంది ఉన్నారు. మనకు మనోబలంలేదు, ఆత్మవిశ్వాసం లేదు, మనమీద మనకు నమ్మకంలేదు అందువలననే జీవితంలో ఏమీ సాధించలేకపోతున్నాము.

భగవంతుడు మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు. నీకు శాంతి కావాలంటే భగవంతునికి శరణాగతి చెయ్యి, శాంతిని పొందు. భగవంతుడు చెప్పిన మాటల మీద మనకు నమ్మకం లేదు. విలేఖర్లు వ్రాసిన మాటలమీద ఉన్న గౌరవం కూడా మనకు భగవంతుడు చెప్పిన మాటలమీద లేదు. అందుచేత మనం భక్తులం కాదు, కాని భక్తులం అని పిలువబడుతున్నాము. కొంతమంది ఇంటిలోని వ్యక్తులమీద విపరీతమైన ఎటాచ్‌మెంట్ పెట్టుకొంటారు. నీవు లేకపోతే నేను ఉండలేను అంటారు. ఇవి అన్నీ అజ్ఞానపు మాటలు, పిచ్చగొడవలు. మరి వారు చనిపోతే ఎలా ఉంటున్నారు. వారు చనిపోయినప్పుడు మీరు కూడా పోవచ్చుకదా. వారు చనిపోతే మీరు పోరు, ఆ శవాన్ని ఎప్పుడు తీసుకొని పోతారా అని చూస్తారు. ఇవి అన్నీ అహంభావనతో మాట్లాడేమాటలు. అంతా భగవంతుడిదే, సంపద అంతా ఆయనదే. అసలు నీది అంటూ ఏదీలేదు అని ముందు గ్రహించు. అంతా ఆయనదే. నీవు అన్నంతిను. నీది అనుకొని తినవద్దు, ఆయనదే అనుకొని తిను. నీవు ఏది చేసినా సొంతం అనుకొనిచేయవద్దు. భగవంతుడిదే అనుకొని చెయ్యి. అంతా భగవంతుడిదే, కాని నాది అనుకోవటం, ఆయనది ఆయనకే ఇవ్వటం, త్యాగం అనుకోవటం. ఇది మన ఆలోచనలో పొరపాటు. అంతా నీదే అని తెలియక, నాది నాది అనుకొన్నాను అని జ్ఞానం కలిగాక నీకు తెలుస్తుంది. భగవంతుడిని ప్రార్థిస్తున్నాము, జపిస్తున్నాము కాని సంతృప్తి కలగటంలేదు అని అడిగితే భగవంతుడు ఉన్నాడు అని ముందు పూర్తిగా విశ్వసించు,





అప్పుడు ప్రార్థించు నీకు సంతృప్తి కలుగుతుంది. మీరే కర్త అనుకోవటం వలన అందరికి చిక్కులు వస్తున్నాయి. కర్త లేని కర్మను చెయ్యమని భగవంతుడు గీతలో చెప్పాడు. మనం పనిచేస్తున్నాము, మనం చేసేపని మనలను బంధిస్తుంది. ఏరకంగా పనిచేస్తే అది మనలను బంధించదో ఆరకంగా పనిచెయ్యి. స్వార్థంలేకుండా పనిచేస్తే, కర్తృత్వభావన లేకుండా పనిచేస్తే అది ధ్యానం ఇచ్చే ఫలితం ఇస్తుంది. అధ్యాత్మికంగా ఏ మహాత్ముడు చెప్పినా, ఏ మతం చెప్పినా మానవుడిని దుఃఖంలేనిస్థితికి తీసుకొని వెళ్ళటానికే చెప్పారు. సత్యం మాటకు అందకపోయినా మాటద్వారా ఎంతవరకు చెప్పాలో అంతవరకు చెప్పారు. ఎందుకంటే మానవుడిని దఃఖంలేని స్థితికి తీసుకొని వెళ్ళటానికి చెప్పారు. దుఃఖకారణం బయటలేదు. నీలోపల ఉంది, కర్తృత్వరూపంలో ఉంది. ఏ కారణం వలన దుఃఖం వస్తోందో ఆ కారణాన్ని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి, అదే ఆధ్యాత్మిక సాధనల యొక్క ప్రయోజనం. నీవు ఏ శరీరంలో ఉన్నా కర్తృత్వబుద్ధి నశించేవరకూ దుఃఖం నిన్ను విడిచిపెట్టదు, ఇందులో రాజీలేదు. కర్తృత్వం లేని స్థితి ఒకటి నీలోపల ఉంది అని ముందు మీరు నమ్మాలి. దాని మీద నమ్మకంలేనప్పుడు దానిని పొందటానికి మీరు ఎలా ప్రయత్నం చేయగలరు. అదే మీరు అనుకొంటున్నారు. అదే సర్వస్వం అనుకొంటున్నారు. కర్తృత్వం పోతే నేను ఏమైపోతానో అని మీరు అనుకొంటూ ఉంటే ఇంక మీరు దానిని ఎలా పోగొట్టుకొంటారు. అది లేనిస్థితి ఒకటి మీ హృదయంలో ఉంది అని మీకు గుర్తింపు రావటంలేదు. మీ సాధనలు అన్నీ కర్తృత్వబుద్ధిమీద గురిపెట్టాలి. అప్పడుగాని అది నశించదు, అది నశిస్తే గాని మీ స్వరూపం మీకు వ్యక్తం కాదు.

నాకు భక్తి ఉంది, తపన ఉంది, జిజ్ఞాస ఉంది దానిని మీరు కొంచం పెంచండి అని అడిగితే భగవాన్ ఏమంటున్నారు అంటే నీ ముముక్షత్వంమే నీకు మోక్షాన్ని సంపాదించి పెడుతుంది, జిజ్ఞాసే నీకు జ్ఞానాన్ని కలుగచేస్తుంది, నీవు సత్యం కోసం తపిస్తున్నావు కదా నీ తపనే నీకు సత్యాన్ని పట్టిఇస్తుంది అంటున్నారు. నీకు పూర్ణస్థితి కలిగేవరకూ యజ్ఞదానతపస్సులు విడిచిపెట్టవద్దు అని భగవంతుడు చెప్పాడు. యజ్ఞం అంటే స్వార్ధంలేని కర్మ. అందరి ఉపాదులు నీవే అనుకొని చేస్తే అది దానం. నీ కుడిచేయి చేసేది ఎడమచేయికి తెలియనివ్వకు, అది దానం అని యేసు చెప్పాడు. ఇవ్వటంకోసమే ఇవ్వాలి గాని, ఏదో ఆశించి ఇస్తే అది దానం అవ్వదు. గుర్తింపులకోసం ఏ పని చేయవద్దు. నీవు నిర్మలంగా చెయ్యి, నిశ్చలంగా చెయ్యి. ఎప్పడు చెయ్యాలో, ఎలా చెయ్యాలో తెలుసుకొని

చెయ్యి. దానం అనేది లోపల దయాగుణంలో నుండి వస్తుంది. కర్తృత్వభావన లేకుండా జీవించటమే తపస్సు, అహంభావరహితజీవితమే తపస్సు. తపస్సు అంటే నీ శరీరాన్ని ఎండింపచేయటం కాదు, నీలో ఉన్న అజ్ఞానాన్ని ఎండింపచేయటం తపస్సు. నీవు మద్రాసు వెళ్ళే రైలులో కూర్చొన్నావు అనుకో, నీవు వద్దన్నా అది నిన్ను మద్రాసు తీసుకొని పోతుంది., అలాగే నీకు సత్యాన్వేషణబుద్ధి ఉన్నప్పుడు సత్యం నీకు ఎఱుకలోనికి వస్తుంది, దానిని ఎవరూ నివారించలేరు. నీకు సత్యానుభవం కలిగినప్పుడు నమ్మకాలమీద, శాస్త్రాలమీద, బాహ్యప్రక్రియల మీద ఆధారపడి ఉండనక్కరలేదు. ఏ సుఖాన్ని తెలుసుకున్నాక దానికి మించిన సుఖం కాని, దానితోసమానమైన సుఖం గాని లేదు అని నీకు తెలుస్తుందో అదే ఆత్మసుఖం, అదే ఆత్మశాంతి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 3-12-2002, మురమళ్ళ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఆధ్యాత్మికమార్గంలో ప్రయాణం చేసేటప్పుడు ముఖ్యంగా మనం ఆత్మవిశ్వాసం విడిచిపెట్టకూడదు, ఇతరులను అనుసరించకూడదు. మనం మంచిది అనుకొన్న మార్గమును విడిచిపెట్టకుండా, చివరి శ్వాసవరకు ఆ మార్గంలో ప్రయాణం చేస్తే ఆత్మశాంతిని పొందుతాము, మరణంలేనిస్థితిని పొందుతాము. ధనం సంపాదించేవాడికంటే ధర్మాన్ని ఆచరించేవాడే ఎక్కువ ఆనందాన్ని పొందుతాడు అని శాస్త్రంలో ఒకమాట ఉంది. తిండి మాట ఈ రెండు విషయాలలో మనం జాగ్రత్తగా ఉండాలి. సమాజంలో ఎక్కువ పేచీలకు మాటే కారణం. అందుచేత మన మాట సౌమ్యంగా ఉండాలి, హితవుగా ఉండాలి, ఇతరుల మనసులకు చల్లదనం కలుగజేసేదిగా ఉండాలి. మీకు మాటలు బాగావచ్చుకదా అని ఇతరులను విమర్శించకూడదు. నువ్వు బాగుపడటానికి ప్రయత్నంచెయ్యి, ఇతరులు బాగుపడటానికి సహకారం చెయ్యి ఆ శక్తి నీకు లేకపోతే ఊరక ఉండు. తిండి విషయంలో ఆశ ఉండకూడదు శరీరానికి ఎంతవరకు అవసరమో అంతవరకు తిను, అతిగా తినవద్దు. తిండిదగ్గర, మాటదగ్గర జాగ్రత్తగా లేకపోతే మనం మంచి మార్గంలో నడవలేము. మంచి మార్గాన్ని మనం విడిచిపెట్టకుండా ఉంటే భగవంతుడు మనకు మంచిబుద్ధిని ఇచ్చి, ఆ మంచిబుద్ధి ద్వారా మనకు జ్ఞానసముపార్జన చేసుకొనే శక్తిని ఇచ్చి, మనకు జ్ఞానాన్ని ప్రసాదించి, ఈ జ్ఞానం సహాయంతో మన హృదయంలో ఉన్న అజ్ఞానాన్ని బయటకు





తొలగింపజేస్తాడు, వాడు ఈశ్వరుడు. ఆత్మజ్ఞానసముపార్జనకు ప్రయత్నంచేయాలి. ఎట్టిపరిస్థితులలోను వినయం విడిచిపెట్టకూడదు. మన హృదయంలో ఉన్న బలహీనతలు ఏమిటో మనకు తెలియవు. ఆ బలహీనతలు మనకు తెలియటానికి మనలను తలుపు సందున పెట్టి నొక్కినట్లు క్లిష్టపరిస్థితులలో పెడతాడు. అప్పుడుగాని మనలో ఉన్న బలహీనతలు మనకు తెలియవు. మనలో ఉన్న బలహీనతలు మనకు తెలియజేసి వాటిలోనుండి మనలను విడుదలచేయటానికి ఇది అంతా చేస్తున్నాడుగాని మన మీద దయలేక కాదు. పరిస్థితులుమనకు అనుకూలంగా ఉన్నా గర్వం తెచ్చుకోవద్దు. మనకు గర్వం వస్తూఉంటే మనపతనం ప్రారంభమవుతుంది. అక్కడ మాటలు ఇక్కడ, ఇక్కడ మాటలు అక్కడ చెప్పటం వలన మనస్సు కలుషితమవుతుంది, అందువలన చాడీలు చెప్పవద్దు. నీవు ఏరకంగా జీవిస్తే, సమాజం పట్ల నీవు ఏరకంగా ప్రవర్తిస్తే నీకు ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం కలుగుతుందో ఆరకంగా జీవించమని శాస్త్రం చెపుతుంది. ధర్మాన్ని ఆచరించకుండా ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం రాదు.

మీరు పూజ, జపం, ధ్యానం చేసుకోండి. కాని మీరు చేసే సాధనల వలనమీ మనస్సు బాహ్యముఖమవుతోందా, అంతర్ముఖమవుతోందా అనేది చూసుకోండి. మీ మనస్సు బాహ్యముఖానికి వెడుతూఉంటే ఆరోజుకారోజు అజ్ఞానం పెరిగిపోతుంది, మీ మనస్సు అంతర్ముఖంగా వెడుతూఉంటేమీకు తెలియకుండానే జ్ఞానం కలుగుతుంది. రాగద్వేషములు తగ్గించుకోవటం వలన మన మనస్సు బాహ్యముఖానికి వెళ్ళటం ఆగిపోతుంది, మనస్సు యొక్క చాపల్యం తగ్గుతుంది, పుల్లకు ఎన్ని వంకరలు ఉన్నా ఆ వంకరలు అన్నీ పొయ్యిలో కాలిపోతాయి అలాగే బుద్ధిలో ఎన్ని దోషాలు ఉన్నా అవి అన్నీ కూడా జ్ఞానాగ్నిలో కాలిపోతాయి. జీవితంలో అహంభావన కలుగజేసుకోకుండా బహుజాగ్రత్తగా జీవించాలి. అహంభావన వేరుతోసహా నశిస్తే మీరు జీవన్ముక్తులవుతారు. ప్రతీ జీవన్ముక్తుడు పూజార్హుడే. దేహానికి రోగం వస్తే నాకు వచ్చిందని, గౌరవం వస్తే నాకు వచ్చిందని, అగౌరవం వస్తే నాకు వచ్చిందని అనుకొంటున్నారు. నీలోపలఉండి ఇవిఅన్నీ చెప్పేవాడు ఎవడు? వాడే జీవుడు, వాడే అహంభావన, నీలోపలఉండి దేహంతో తాదాప్యం పొంది దేహం చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అని చెప్పేవాడు కూడా వాడే. సబ్జక్టు మీరు బాగా అర్థం చేసుకోండి. భగవంతుడు మనకు నడవటానికి కాళ్ళు ఎలా ఇచ్చాడో, పని చేయటానికి చేతులు ఎలా ఇచ్చాడో అలాగే అర్థంచేసుకోవటానికి మెదడు ఇచ్చాడు. మనం మెదడుతో విషయాలను

జాగ్రత్తగా అర్థంచేసుకోవాలి. మీరు ఆత్మవిశ్వాసం కలిగిఉండాలి, ధైర్యంగా ఉండాలి, కోపరహితుడుగా, భయరహితుడుగా ఉండాలి. మనకు మాటమాటకు భయం, కోపం వస్తూఉంటే మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. భయరహితుడికి, కోపరహితుడికి అసూయరహితుడికి మాత్రమే ఆత్మానుభవం కలుగుతుంది. భయం, కోపం, అసూయ ఇవిఅన్నీ ఉంటే ఆత్మజ్ఞానం కలిగే అవకాశం లేదు. అత్యంత ముఖ్యమైనది ఏమిటి అంటే మిమ్మల్ని అస్తమానం మీరు సంతృప్తి పరచుకోవటానికి ప్రయత్నం చేయకండి. 24 గంటలు మనలను మనం సంతృప్తి పరచుకోవటానికి చూడటం, ఇతరులు మనలను సంతృప్తి పరస్తున్నారా లేదా అని చూసుకోవటం ఇంక మనకు జ్ఞానం ఏమిటి? ఇతరుల సంతృప్తి నాకు అక్కరలేదు, ఇతరుల సంతోషం నాకు అక్కరలేదు, ఎంతసేపు నా సంతోషంగురించి, నా సంతృప్తి గురించి చూసుకోవటం. ఈ రకంగా జీవిస్తూ ఉంటే దేహాభిమానం పెరుగుతుంది. నా అహంకారాన్ని సంతృప్తి పరచుకొంటూఉంటే నాకు ఆత్మజ్ఞానం ఏమిటి? ఏ వస్తువుకయితే మరణంలేదో ఆ వస్తువు అనుభవంలోనికి వచ్చేవరకు ఇలా శవాలను మోస్తూ ఉండవలసిందే, ప్రకృతి నిన్ను విడిచిపెట్టదు. మానసిక వత్తిడికి గురికావద్దు. ఇతరులకు మీ మీద అసూయ ఉంది అనుకోండి తిరిగి మీరు వారి మీద అసూయ పడవద్దు, వారి వలలో పడవద్దు. మనకు తెలివి, వివేకం అవసరం ఎందుకు అంటే ఇతరులను మోసం చేయటానికి కాదు, ఇతరులు మనలను మోసం చేస్తూఉంటే ఆ వలలో పడకుండా ఉండటంకోసం మనకు వివేకం, విచక్షణ అవసరం.

మనం పైకి అందరిలాగ ఉండాలి, లోపల వైరాగ్యం పెంచుకొంటూ రావాలి, హృదయం యొక్క లోతులు పెంచుకొంటూ రావాలి. పని శ్రద్దగా చేసుకొంటూ వెళ్ళాలి. నా దేహంతో నేను ఎలా తాదాప్యం పొందుతున్నానో అలా దేశంతో నేను తాదాప్యం పొందగలిగితే అది దేశభక్తి, మీ మనస్సును దైవంలో ఐక్యపరిస్తే దైవభక్తి అంటారు, బ్రహ్మంలో ఐక్యపరిస్తే బ్రహ్మజ్ఞాని అవుతాడు. మీరు చేతులతో పూజ చేసుకొంటున్నారు, నోటితో జపం చేస్తున్నారు, మనస్సుతో ధ్యానం చేస్తున్నారు కాని ఒక్కవిషయం మర్చిపోవద్దు. ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం లేకుండా హృదయంలోఉన్న ఈశ్వరుడుమనకు వ్యక్తంకాడు. ఈశ్వరానుగ్రహం లేకుండా, ఆయన దయలేకుండామనలో ఉన్నచీకటి బయటకు పోదు. బయట చీకటిని సూర్యుడు పోగొట్టగలడుగాని లోపలఉన్న చీకటిని మన హృదయంలో ఉన్న అంతర్యామి ఒక్కడే పోగొట్టగలడు. అందుచేత మన హృదయంలో ఉన్న అంతర్యామికి శరణాగతి



4A

చెందటమే మన జీవితగమ్యం. శరణాగతికి మించిన గతిలేదు. జీవితంలో మెలకువగా ఉండాలి, అజాగ్రత్త పనికిరాదు, అశ్రద్ధపనికిరాదు. ఇతరులు మంచివారా, చెడ్డవారా అనేది మనకు అనవసరం. మీరు ఎంతవరకు మంచివారో చూసుకోండి. ఇతరుల మీద తీర్పు చెప్పటం ప్రారంభిస్తే మన పతనం ప్రారంభమవుతుంది. మీ మనస్సులో ఏదోషాలు ఉన్నాయో చూసుకొని, వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయండి. మీలోఉన్న బలహీనతలు, వాసనలు పునర్జన్మకు కారణం అవుతాయి. ఇతరుల మీద తీర్పు చెప్పటంలో కొత్తవాసనలు వస్తాయి. ఇతరులను విమర్శించటం కాదు, మిమ్మల్ని మీరు విమర్శించుకొని, మీ మనస్సును సరిచేసుకొని, మనస్సులో వంకరలు ఉంటే సరిచేసుకొంటూ ఇలా మీ జీవితాన్ని బాగుచేసుకోవటానికి మీరు ప్రయత్నం చేస్తూ ఉంటే మీరు బాగుపడతారు, మీతోపాటు ప్రపంచంకూడా బాగుపడుతుంది. సాధన రేపు రేపు అనుకోవద్దు. రేపుకు రూపు లేదు. ఏరోజుపని ఆరోజు శ్రద్దగా చేసుకోండి, ఏరోజు సాధనఆరోజు చేసుకోండి రేపు చేద్దాము అని అనుకోవద్దు. రేపు రేపు అనుకొంటూ ఉంటే ఏదోరోజు మరణం వచ్చేస్తుంది. అందుచేత కాలాన్ని పాడుచేసుకోవద్దు, గతించిన కాలం తిరిగిరాదు. జరిగిపోయిన గొడవలు మర్చిపోండి, వాటిని గుర్తుపెట్టుకొంటే మనస్సు కలుషితం అవుతుంది. వర్తమానకాలంలో జాగ్రత్తగా ఉంటే, సాధన చేసుకొంటూ ఉంటే భవిష్యత్‌కాలంలో మీకు అంతా మంచి జరుగుతుంది, మీకు జ్ఞానం కలుగుతుంది. మీరు ప్రతీ విషయానికి ఉద్రేకపడవద్దు, ఇతరులను ఉద్రేకపరచవద్దు. ఇతరులు మిమ్మల్ని ఉద్రేకపరచటానికి ప్రయత్నం చేసినా మీరు ఉద్రేకరహితంగా ఉండాలి. ఆ మాట వారు ఎందుకు మాట్లాడుతున్నారో మీరు అర్థంచేసుకోవాలి, ఆ మాత్రం వివేకం మీకు ఉండాలి. మీకు ఉద్రేకం వచ్చినప్పుడు నోటికితాళం వేసుకోవాలి, లేకపోతే చెడ్డమాటలు వస్తాయి. ఎవరైనా వెకిలిగా మాట్లాడుతున్నారు అనుకోండి అది చూసి మీరు ఉద్రేకపడవద్దు, అది జీవలక్షణం. జీవలక్షణాలు అన్నీ శేషం లేకుండా నశించేవరకు ఆత్మజ్ఞానం కలిగే అవకాశం లేదు. గాఢనిద్రలో మనం హృదయంలోనికి వెళ్ళిపోతున్నాము. అంటే మన నిజమైన ఇంటికి వెళ్ళిపోతున్నాము. మీ ఇంటికి మీరు వెళ్ళాక శరీరంతోటి, బంధువులతోటి, లోకంతోటి, దేవుడితోటి విడిపోతున్నారు, మీరు ఏదైతే కాదో వాటిలోనుండి మీరు విడిపోతున్నారు. ఆ స్థితిని జాగ్రదవస్థలో తెచ్చుకోవాలి, అదే ఆత్మజ్ఞానం. మన ఇంటికి మనం వెళ్ళేవరకు మనకు శాంతిలేదు, ఆనందంలేదు, అంతవరకు ఇలా దేహాలను మోస్తూ ఉండవలసిందే. మనకు

నిద్రపట్టటానికి అన్నిరకాల సౌకర్యాలు సరిగా ఉన్నాయో, లేదో చూసుకొంటాము. అలాగే జాగ్రదవస్థలో ఎఱుకలో ఉండగా హృదయంలోనికి వెళ్లటానికి అన్నిరకాల సాధనలు చేస్తూ ఉంటే నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. దేవుడు ఎక్కడ ఉన్నాడు అని భగవాన్‌ను అడిగితే వైకుంఠంలో ఉన్నాడు, కైలాసంలో ఉన్నాడు అని ఆయన చెప్పలేదు. నీ దేహం ఎంతనిజమో, లోకంఎంతనిజమో, పుణ్యపాపాలు ఎంతనిజమో వైకుంఠంలో ఉన్న దేవుడు కూడా అంతేనిజం. ఇవి అన్నీ వ్యవహారిక సత్యములేగాని పారమార్థిక సత్యములు కాదు. పారమార్థిక సత్యం నీ హృదయంలోనే ఉంది. అక్కడకు చేరేవరకు నీ జీవితప్రయాణం ఆగదు. నీ శరీర యాత్ర స్మశానంతో ముగిసిపోతుంది గాని నీ నిజమైన ఇంటికి వెళ్లేవరకు, అక్కడ స్థిరపడేవరకు నీ జీవితం కంటిన్యూ అవుతూనే ఉంటుంది.

మీకు ఏమైనా సమస్యలు వస్తే పారిపోకండి, వాటిని పరిష్కరించుకోవటానికి ప్రయత్నం చేయండి. ఎవరైనా పొగిడితే పొంగిపోతున్నారు, విమర్శిస్తే కృంగిపోతున్నారు. ఎందుచేతనంటే అవి నిజం అనుకొంటున్నారు. అది నిజంకాదు అని మీకు తెలిస్తే మీ మనస్సు కదలదు. మీ మనస్సును ఆగమంటే ఆగటంలేదు, నా మనస్సును కదలమంటే కదలటంలేదు అనేవారు భగవాన్. ఈశ్వరుని సదా స్మరించుకోండి. ఎట్టి పరిస్థితులలోను భగవంతుని పాదాలను విడిచిపెట్టవద్దు. మీ ఇంటిలో అందరూ నాస్తికులు అయినా మీరు భక్తిని విడిచిపెట్టవద్దు, ఒంటరిగా ప్రయాణం చేయండి, లోపల భక్తిని పెంచుకోండి. మన శరీరం చనిపోయిన తరువాత మనకు ఎవరూ జతరారు. మీరు అంతటివారు, ఇంతటివారు అని మనలను పొగిడినవారు స్మశానం వరకు కూడా రారు. ఇవి ఏమీనిజం కాదు. అందుచేత మీరు ఒంటరిగా ప్రయాణం చేయటానికి సిద్దంగా ఉండండి. అలా సిద్దంగా లేకపోతే మీకు ఆత్మజ్ఞానం కలుగదు. ఈప్రపంచంలో ఉన్న భోగాలు నిజం అనుకోద్దు. మీకు భగవంతుడు ఏదైనా సంపద ఇస్తే దానిని మీరు ఒక్కరే భోగించకండి. ఎంతో కొంత జ్ఞానసముపార్జనకు ఉపయోగించుకోండి, సమాజానికి ఉపయోగించండి, సమాజరూపంలో ఉన్నవాడు కూడా భగవంతుడే. ఆయన దయకు మనం పాత్రులం అవ్వాలి. జ్ఞాని మనతోపాటు ఉంటాడు, మనతోపాటు మాట్లాడతాడు, నవ్వుతాడు, మనతోపాటు ఏడుస్తాడు కాని లోపలచూస్తే ఆయనకు మనం చాలా దూరం. మన దేహం అహంభావన స్వాధీనంలోఉంటుంది, కాని జ్ఞాని దేహం ఈశ్వరుని చేతలో పనిముట్టు క్రింద ఉంటుంది. జీవలక్షణాలు ఎప్పుడైతే నశించాయో లోపలఉన్న పరమేశ్వరుడు నీ





దేహాన్ని స్వాధీనం చేసుకొని నీద్వారా ఆయన పనిచేస్తాడు అప్పుడు నీవు జీవన్ముక్తుడవు అవుతావు. కృష్ణుడు చేతిలో ఉన్న మురళి ఎలా గుల్లక్రింద ఉంటుందో అలాగ నీ హృదయం గుల్లఅయితే అంటే హృదయం ఖాళీ అయితే మురళిని ఆయన నోట్లో పెట్టుకొన్నట్లుగా నీ దేహాన్ని ఆయన ఉపయోగించుకొంటాడు, ఆయనే ఈశ్వరుడు.

ఇతరులకు మీరు ఏదైనా చెప్పగలిగితే మంచిమాటలు చెప్పండి లేకపోతే ఊరక ఉండండి, అసూయ మాటలు చెప్పవద్దు. మన జీవితం సగం నిద్రలో పోతుంది. మిగతా సగంటైమును మనం సద్వినియోగంచేసుకోకపోతే మనకు జ్ఞానం కలుగదు. మన బుద్ధిలో ఉన్న వంకరలు తొలగించుకోవటానికి ఈభూమి మీదకు వచ్చాము. కేవలం తిండి తినటానికి, బట్టకట్టుకోవటానికి, ఊరేగటానికి ఇక్కడకురాలేదు. మనం చిన్నపనులుకూడా గొప్పగాచేస్తే అంటే భక్తిగా, ప్రేమగా, శ్రద్ధగా చేస్తే భగవంతుని దయ కలుగుతుంది. పెట్టె మన దగ్గర ఉంది, తాళం భగవంతుడి దగ్గర ఉంది. తాళం మనకు ఇస్తే పెట్టె ఓపెన్ చేసుకోవచ్చు. ఆయన దయకలిగితేగాని తాళం ఇవ్వడు. మన లోపల అంతర్యామిగా భగవంతుడు ఉన్నాడు. దేహప్రారబ్దాన్నిబట్టి మనలను అదృష్టం వెంటాడినా, దురదృష్టం వెంటాడినా కూడా అన్ని కాలాలలోను, అన్ని అవస్థలలోను ఆయన పాదాలను విడిచిపెట్టకుండా ఉంటే మన హృదయంలో జ్ఞానదీపాన్ని, శాంతిదీపాన్ని వెలిగిస్తాడు. అప్పుడు ఇంక మనకు చీకటి ఉండదు. ఎటుచూసినా కాంతే, ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా శాంతే. అహంకారం ఉంటే అంతా ఉంది, అది లేకపోతే ఏదీ లేదు అనేవారు భగవాన్. మొత్తం సృష్టి అంతా కూడా అహంభావన అనే ఒంటిస్థంబం మీద ఆధారపడి ఉంది. అహంభావనను కూల్చివేసావా ఏదీలేదు. చివరకునీవు మిగులుతావు. అంటే కల్పితం అంతా పోతుంది, వాస్తవం మిగులుతుంది. మనం ఈ ప్రపంచంలోనికి వచ్చాము కాబట్టి మన సాధనఏదో చేసుకొని దీనిని విడిచిపెట్టి బయటకు పోవాలి. ప్రపంచాన్ని బాగుచేద్దామని ప్రయత్నం చేసేబదులు నువ్వు బాగుపడు, నువ్వు బాగుపడితే ప్రపంచం కూడా బాగుపడుతుంది. జ్ఞాని ఒకరూపంతో గాని, ఒక నామంతో గాని తాదాప్యం పొందడు. జ్ఞాని లోకంతో వ్యవహరించేటప్పుడు కూడా జ్ఞాని యొక్క వైభవం మనకు కొంతతెలుస్తూ ఉంటుంది. అందులో ప్రత్యేకత ఉంటుంది. ప్రత్యేకత ఉండాలి అని ఆయన అనుకోడు కాని మనకు అనిపిస్తుంది. జ్ఞాని మాట, చూపు, చేత అన్నీ శుద్ధంగా ఉంటాయి. జ్ఞానికి తలంపు వచ్చినా అది బంధించదు. మన లోపల భగవంతుడు ఉన్నాడు, ఆయన దయలేకుండా లేడు, ఆయన

దయాస్వరూపుడు. మన అహంకారం మీద ఉన్న నమ్మకం మనకు ఈశ్వరుని దయ మీద లేదు. మనకు శరణాగతిలేకపోవటం వలన, ఆయన మీద విశ్వాసంలేకపోవటం వలన ఈశ్వరానుగ్రహానికి అనుగుణంగా మన జీవితాన్ని తీర్చిదిద్దుకోలేక పోతున్నాము.

నువ్వు ఏదిగా ఉన్నావో దానిని గుర్తించటానికి ప్రయత్నం చెయ్యి. ఇతరులను తెల్సుకోవటంకాదు, నిన్ను నీవు తెల్సుకోవటానికి ప్రయత్నం చెయ్యి. నిన్ను నీవు తెల్సుకొంటే నీద్వారా ఇతరులకు సహాయసహకారములు అందుతాయి. మిమ్మల్ని మీరు విమర్శించుకోండి. మీలోఏబలహీనతలు ఉన్నాయో చూసుకొని వాటిలోనుండి బయటకు రావటానికి ప్రయత్నం చేయండి. ఈ జన్మలో ఉన్న బలహీనతలే రాబోయే జన్మకు కారణం అవుతాయి. ఈశ్వరుని దయ లేకుండా చిన్న అలవాటులోనుండి కూడా నీవు బయటకురాలేవు. చావు అంటే భయపడకండి. చావు అంటే మారటం, ఒక దేహంలోనుండి ఇంకోదేహంలోనికి మారతావు అంతే. తల్లి పిల్లవాడికి పాలు ఇస్తుంది. ఒక స్థనంలోనుండి ఇంకో స్తనంలోనికి మార్చినప్పడు పిల్లవాడు ఏడుస్తాడు. ఎక్కువ పాలు ఉన్న స్తనంలోనికి మారుస్తూ ఉంటే అది తెలియక పిల్లవాడు ఏడుస్తాడు. తల్లి చేసేపని పిల్లవాడికి తెలియదు కాని తల్లికి తెలుస్తుంది. ఆ పిల్లవాడు చేసేపనేమనం చేస్తున్నాము. ఇంతకంటే మంచి దేహం వస్తుంది, సాధన చేసుకోవటానికి అనుకూల పరిస్థితులు వస్తాయి అని మనకు తెలియక కంగారుపడి మరణం అంటే గోలపెట్టేస్తున్నారు. ఈజన్మను ఎందుకు మారుస్తున్నాడో భగవంతుడికి తెలుసుకాని మనకు తెలియదు. మీరు శరీరాన్ని దుఃఖంగా విడిచిపెడితే వచ్చేజన్మలో మీకు దుఃఖమే సిద్ధమవుతుంది. ఏ భగవంతుడు అయితే మనకు ప్రాణంపోసాడో ఆయనే మన ప్రాణం తీసేస్తున్నాడు, ఇది భగవంతుడి ప్రసాదమే అని శరీరాన్ని విడిచిపెట్టాలి గాని ఏడుస్తూ విడిచిపెట్టకూడదు. మరణించటం కూడా మనం నేర్చుకోవాలి. మరణించేటైములో శాంతిగా ఉండాలి. మనకు ఏదైనా అశాంతి ఉంటే మరణం రాకముందే ఆ అశాంతిని తొలగించుకోవాలి. చావు అంటే ఎందుకు బయపడుతున్నారు అంటే లోకం కనబడదు, ఈ దేహం కనబడదు అని కంగారుపడుతున్నారు. అసలు చావు వరకు ఎందుకు రోజూ నిద్రలో నీకు లోకం దేహం కనబడుతున్నాయా? కనబడటంలేదు. మరి నిద్ర అంటే ఎందుకు భయం అనిపించటంలేదు. ఇది బాగా అర్థం చేసుకోండి. నిద్రపోయేటప్పడు మరల రేపు ఉదయం లేస్తాము అనే తలంపువలన భయం కలగటం లేదు. చనిపోయేటప్పడు మరల ఈ దేహం కనబడదు అనే తలంపువలన భయం కలుగుతోంది,





దుఃఖం వస్తోంది. అజ్ఞాని ఈ ప్రపంచాన్ని చూస్తాడు, జ్ఞాని ఈ ప్రపంచాన్ని చూస్తాడు కాని చూచే చూపు వేరు. అజ్ఞాని ఇది నిజం అనుకొంటాడు, జ్ఞాని మాత్రం తెరమీద బొమ్మలుగా చూస్తాడు, ఇది నిజంకాదు అని వాడికి తెలుస్తూ ఉంటుంది. అలా తెలిసినప్పడు ఈ ప్రపంచంలో ఏ సంఘటనకూడా వాడిని ఉద్రేకపరచదు, వాటిప్రభావం వాడిమీద ఉండదు. జ్ఞానికి ఈ ప్రపంచం ఒక లీల, ఒక ఆట. మనం ఈ ప్రపంచం అనే తెరమీద ఆడటానికి వచ్చాము. తెరమీద రాజు రాజు కాదు, చాకలి చాకలి కాదు, కలెక్టరు కలెక్టరు కాదు, ఇవన్నీ వేషాలు. మన దేహప్రారబ్ధమును బట్టి వేషాలు వేసుకొని వచ్చాము. మరల ఈ వేషాలు విడిచిపెట్టి వెళ్ళిపోతాము. అందుచేత గతించిన కాలం మర్చిపోండి. వర్తమానకాలంలో జీవించండి. వర్తమానకాలంలో మీరు ధర్మబద్ధంగా జీవిస్తే, మీ మనస్సును **ఏగంటకు ఆగంట బేలెన్స్ చేసుకొంటూ ఉంటే, శ్రద్ధగా ప్రేమగా ఎఱుకతోటి భేదబుద్ధి లేకుండా జీవిస్తూ ఉంటే భవిష్యత్‌లో మీ అందరికి ఆత్మజ్ఞానం కలుగుతుంది.**

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 16-12-2002, చించినాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

నీ హృదయంలో ఆనందం ఉంది, శాంతి ఉంది. భగవంతుడు నీ హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు. ఆయన నీకు తెలియటం లేదు కాబట్టి లేడు అనుకొంటున్నావు. ఆయన ఎవరికి తెలియబడతాడు అంటే ఎవరికైతే రజోగుణం పూర్తిగా అణిగిందో, లోకవాసన ఎవరికైతే వేరుతోసహా నశించిందో, ఎవరిలోఅయితే కల్మషం లేదో, ఎవరి మనస్సు అయితే నిర్మలంగా, నిశ్చలంగా, ప్రశాంతంగా ఉందో వారికి భగవంతుడు తెలియబడతాడు. కల్మషం ఉన్నవాడు ఎంత సాధన చేసినా ఏమీప్రయోజనం లేదు. మీరు జీవితంలో జరిగేసంఘటనలతో ఒకటిగా ఉంటున్నారు, శరీరంతోటి మనస్సుతోటి ఒకటిగాఉంటున్నారు, అలాగ మీలోపలఉన్న బ్రహ్మంతో ఒకటిగాఉండగలిగినప్పడు మీలోపలఉన్న ఆనందం, శాంతి మీకు అందుతుంది. రామకృష్ణుడికి చదువురాదు కాని వరల్డ్‌టీచర్ అయ్యాడు. ఎలా అయ్యాడు అంటే లోపల కపటంలేదు, పరమపవిత్రుడు. లోపలఉన్న సద్వస్తువు ఎంత పవిత్రమైనదో మనం అంత పవిత్రమైతేకాని దానితో ఒకటిగా అవ్వలేము. ఒక్క బ్రహ్మంలో తప్పించి ఇంక బయట ఎక్కడా ఆనందంలేదు కాని ఉందని నీవు అనుకొంటున్నావు. ఇవి అన్నీ మిధ్యాసుఖాలు. ఈ సుఖాలు అన్నీ భవిష్యత్‌లో దుః

ఖాలు క్రింద మారతాయి. ప్రతీ జీవికి ఆనందం కావాలి ఎందుకు కావాలి అంటే మన మనస్సు ఆనందంలోనుండి వచ్చింది. అది ఎక్కడనుండి వచ్చిందో అక్కడికి వెళ్ళిపోతే ఉన్నది ఆనందమే, ఉన్నది శాంతే. మీకు ఎన్నివేలతలంపులు వచ్చినా కంగారుపడవద్దు అన్నారు భగవాన్. ఇవి అన్నీ దొంగనేనుకే వస్తున్నాయి. నిజమైననేనుకు తలంపులు లేవు. మూల తలంపు ఉంటేనే నీకు ఇతరతలంపులు వస్తాయి. మూలతలంపు మూలం నీలోపల ఉంది, అక్కడకు వెళ్ళు. అక్కడకు వెళ్ళాలంటే నీవు ఏమి చేయాలిఅంటే నీకు ఎవరైనా అపకారం చేసారంటే అది మర్చిపోవాలి, ఉపకారం చేస్తే అది గుర్తుపెట్టుకోవాలి. మనం ఏమి చేస్తున్నాము అంటే గుర్తుపెట్టుకోవలసింది మర్చిపోతున్నాము, మర్చిపోవలసినదానిని గుర్తుపెట్టుకొంటున్నాము. ఇంక మనం ఎలా లోపలకు వెళ్ళగలము? నేను జపం చేస్తున్నాను అనిభగవాన్‌తో అంటే నేను జపం చేస్తున్నాను అంటున్నావు, జపం చేయటానికి లోపల ఒకడు ఉండాలి కదా, వాడు ఎవడు? అంటున్నారు భగవాన్, ఆ చేసేవాడిని మధ్యమధ్యలో కొంచెం చూసుకొంటూ ఉండు, వాడిని విచారణ చెయ్యి, వాడిని బోను ఎక్కించు. జపం చేసేవాడిని చూసుకొంటూ ఉంటే వాడు నెమ్మదిగా లోపలకు జరుగుతూ ఉంటాడు. జరిగి, జరిగి, ఏ హృదయంలో అయితే ఈశ్వరుడు ఉన్నాడో అక్కడకు వెళ్ళిపోతాడు. అక్కడికి వెళితే ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఎదుటివాడిని విచారణచేస్తే అజ్ఞానం పెరుగుతుంది. నిన్ను నీవు విచారణ చేసుకొంటే జ్ఞానం కలుగుతుంది. మీలోపల వికారములు ఉన్నంతకాలం, బలహీనతలు ఉన్నంతకాలం పునర్జన్మ వచ్చితీరుతుంది. ఎందుచేతనంటే మనస్సులోఉన్నగుణాలు వ్యక్తమవ్వాలంటే ఏదో దేహం ఉండాలి. విధి బలీయమైనది అని శాస్త్రం చెపుతుంది. భగవాన్ దానిని ఒక్క వాక్యంతో కొట్టిపాడేశారు. అక్కడ అనుభవాన్ని చేతిలో పెట్టుకొని చెపుతున్నారు, ఇది అనుకరణకాదు. విధిని గడ్డిపరకను తీసి అవతలపడేసినట్లు తీసేసారు. విధి ఎవరికి శరీరానికి, నువ్వు ఈశ్వరుడికి శరణాగతి చెందితే విధి ఎక్కడ ఉంది అన్నారు. పుట్టటం, పెరగటం, చనిపోవటం ఇవి అన్నీ శరీరానికే. పుట్టినదానికి విధి కాని పుట్టనిదానికి విధి ఏమిటి? నువ్వు ఈశ్వరుని పాదాలకు నీ మనస్సును అర్పించావు అనుకో దేహంతాలుక విధి ఏమి చేస్తుంది అన్నారు భగవాన్, నేను ఈశ్వరునికి శరణాగతి చేస్తాను అనుకోండి. నేను అనుకొన్నది ఆయన చేస్తాడో, లేదో అని ఒక భక్తుడు భగవాన్‌ను అడుగుతున్నాడు. శరణాగతి చెందిన మనస్సేనా ఈ ప్రశ్నలు అడిగేది అంటున్నారు భగవాన్. వారు చేస్తారు, లేకపోతే చేయరు. శరణాగతి చేస్తే నీ మనస్సు ఈ ప్రశ్నలు అడగదు. ఇలా అడుగుతూఉంటే నీకు శరణాగతి లేదు అని అర్థం.





ఒక మనిషి దుర్మార్గంగా ఉన్నాడుఅనుకోండి. జపం చేయగా చేయగా జపఫలితం దుర్మార్గంలో ఉన్నవాడిని సన్మార్గంలోనికి త్రిప్పతుంది. మనకు పూర్వజన్మ పుణ్యఫలం లేకపోతే సత్పురుషులు దొరకరు, ఒకవేళ దొరికినా వారితో సహవాసం చేయాలనిపించదు. నీవు మాట్లాడే మంచిమాట గాని, నీకువచ్చే మంచితలంపుగాని, నీవుచేసే మంచిపని గాని వృధాపోవు. వాటివలన నీకు లోపలనుండి వికాశం వస్తుంది. సత్పురుషుల సహవాసం వలన నీకు ఊహించని శక్తి కలుగుతుంది. 10 గంటలు ధ్యానం చేయటం వలన ఎంతశక్తి వస్తుందో ఒక 5 నిముషాలు సత్పురుషుల సమక్షంలో ఉండటంవలన నీకు అంతశక్తి కలుగుతుంది. ఇది తెలిసినవారు అదృష్టవంతులు, తెలియనివారు దురదృష్టవంతులు. జపం నీవు పైకి అనుకోవచ్చు గాని లోపల చేసుకొనే జపం గొప్పది. మనస్సులో ప్రేమ, ఆప్యాయతలేనప్పుడు భౌతికంగా ఎంత దగ్గరగా ఉన్నా ప్రయోజనం లేదు,మానసిక అనుబంధం ముఖ్యం. మనస్సుతో ఈశ్వరుడితో అనుబంధం పెట్టుకోవాలి. నీ మనస్సు నిగ్రహింపబడుతూ ఉంటే నీవు ఎక్కడ ఉంటే ఏముంది అంటున్నారు భగవాన్. మీ మానసికజపం కొంతకాలానికి ధ్యానం క్రింద మారిపోతుంది. మీరు చేస్తున్న ధ్యానం నిజమైతే మీకు నిలకడవస్తుంది. ఒకే వస్తువు మీద నీ మనస్సును నిలబెట్టి ఉంచటం ధ్యానం. దాని వలన ఇతర తలంపులు ఆగిపోతాయి, అప్పుడు మనస్సు లోపలకు జారిపోతుంది, మనస్సు వెళ్ళి దాని మూలంలో మునుగుతుంది, అప్పుడు నీలోపలఉన్న సద్వస్తువు నీకు వ్యక్తమవుతుంది. మనస్సు యొక్క వ్యాపకాలు పెంచుకోవద్దు. మన ఇంట్లో ఉన్న కంచాన్ని అన్నం తిన్నప్పుడు ఉపయోగించుకొని తరువాత దానిని ప్రక్కన పెట్టేస్తాము. అలాగే మనస్సును కూడా అవసరమైనప్పుడు ఉపయోగించుకొని తరువాత ఒక ప్రక్కన పెట్టేయండి. అసలు మనస్సు అంటేనే అశాంతి, అస్తమాను దాని జోలికి వెళ్ళవద్దు. వ్యర్థమైన కోరికలు, వ్యర్థమైన ఆలోచనలు పెంచుకోవద్దు. మీరు చేసే జపం వ్యర్థంకాదు. మీరు ఏ దేవతానామం జపిస్తున్నారో ఆ దేవతామూర్తి దగ్గరనుండి స్పందనవస్తుంది, రెస్పాన్స్ వస్తుంది, మీరు మాత్రం కంగారు పడవద్దు. నీ మనస్సు నిదానం అవ్వాలంటే, పవిత్రం అవ్వాలంటే జపం, ధ్యానం అవసరమే.

మనం ఏదైనా పనిచేసేటప్పుడు ఫలితం మీద దృష్టి ఉంటుంది కాని పని చేయటానికి ఓర్పు ఉండదు. పనిచేయటానికి తగినంత ఓర్పు ఉంటే ఫలితం కోరకుండానే వస్తుంది. మీరు సహనంగా పనిచూస్తూ ఉంటే, ఫలితం పట్ల ఆసక్తిలేకుండా పనిచేస్తూ ఉంటే

లౌకికమైన ఫలితాలే కాదు మోక్షం కూడా వస్తుంది. మనలో రాగద్వేషములు ఉన్నంతకాలం మన మనస్సు కలుషితం అవ్వకుండా ఉండదు. అద్దంమీద దుమ్ము ఉంటే మన మొఖం అందులో కనబడదు అలాగే మన మనస్సు కలుషితంఅయినప్పడు మన హృదయంలో భగవంతుడు ఉన్నప్పటికి ఆయన మనకు గోచరం కాడు. అహంకారజీవితం అసహజమైనది, ఆత్మజీవితం సహజమైనది. నీవు అసహజంగా జీవిస్తున్నావు కాబట్టి సహజవస్తువు నీకు తెలియటంలేదు. మీరు జపాలు, ధ్యానాలు చేస్తున్నారు. భగవంతుడి నామాన్ని యాంత్రికంగా, అశ్రద్ధగా అనుకోవద్దు. ప్రేమగా, భక్తిగా, గౌరవంగా ఆనామం అనుకోండి. భగవంతుని నామం చేసేటప్పడు నీ మనస్సు అక్కడ ఉండాలి. మనస్సు అక్కడ లేకుండా నామం చేస్తూ ఉంటే భగవంతుడిని అగౌరవపరుస్తున్నావు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నీకు రోగం వచ్చింది అనుకో, అది తగ్గాలంటే దానికి తగిన మందువేసుకోవాలి. ఆ మందుపేరు వింటే సరిపోదు ఆ మందు మింగితే రోగం తగ్గుతుంది. అలాగే నీవు సంసార చక్రంలో తిరుగుతున్నావు, అహంకారమనే జైలులో ఉన్నావు. నేను ఆత్మను, నేను చైతన్యాన్ని అని నోటితో అనుకోవటం వలన పెద్ద ప్రయోజనం ఉండదు. అహంబ్రహ్మాస్మి అని నోటితో అనుకొంటే సరిపోదు, దాని తాలుక అనుభవం నీకు ఉండాలి, దానితో నీవు ఏకంకావాలి అప్పడు ఈ సంసారచక్రంలో నుండి విడుదల పొందుతావు. స్వప్రయత్నం, కాలపరిపక్వం, ఈశ్వర కటాక్షం. నీ ప్రయత్నం నీవు విడిచిపెట్టవద్దు. ప్రయత్నం చేసేటప్పడు ఓర్పు లేకపోతే ప్రయత్నం చేయలేవు. సహనం, సత్వగుణం లేకపోతే నీ సాధన ముందుకు వెళ్ళదు. కాలం కలిసిరావాలి. ఈ రెండూ ఉంటే సరిపోదు. ఈశ్వరుని దయ ఉండాలి, అన్నింటికంటే ఇది ముఖ్యం. ఈశ్వరుని దయకు ఆసాధ్యం అంటూ ఏమీలేదు. ఈశ్వరుని దయలేకపోతే నీవు ఏమీ సాధించలేవు. భగవంతుడు చేసే పనులను మనం ప్రశ్నించకూడదు. మనం ప్రశ్నిస్తే మన భక్తి చెడిపోతుంది. మానవుడు వాడి అహంకారాన్ని పోగొట్టుకోవటానికి జీవించటం లేదు. వాడి అహంకారాన్ని సంతృప్తి పరచుకోవటానికే జీవిస్తున్నాడు. అహంకారాన్ని నాశనం చేసుకోవటానికి బదులు దానిని అలంకరించుకొంటున్నాడు. ఇంక అది ఎక్కడికి పోతుంది, ఇంక మనకు జ్ఞానం ఏమిటి? జపం చేయండి, ధ్యానం చేయండి అని మీరు చెపుతున్నారు కాని నా మనస్సు ఆనందంకోసం ఎదురుచూస్తోంది అని భగవాన్‌నుఅడుగుతున్నాడు. నీవు జపం చేయగా చేయగా నీ బుద్ధి పక్వానికి వచ్చినప్పడు, నీ బుద్ధి కల్మషరహితమైనప్పడు, నీ బుద్ధి ఏకాగ్రమైనప్పడు లోపలఉన్న వస్తువు తనంతట తానుగా వ్యక్తమవుతుంది. ఆ వస్తువు ఆనందానికి భిన్నంగా లేదు, అదే ఆనందం. ఎంతో






కొంత ద్వంద్వాలను మనం సహించాలి. ఎవరైనా పొగుడుతూ ఉంటే పొంగిపోకూడదు, ఎవరైనా విమర్శిస్తూ ఉంటే కృంగిపోకూడదు. బాగా చలివేస్తూ ఉంటే సహించాలి, బాగావేడిగాలివీస్తూఉంటే సహించాలి. ద్వంద్వాలనుమీరు సహించలేకపోతే మీ మనస్సు దారి తప్పిపోతుంది.


మిమ్మల్ని మీరు ఉద్ధరించుకోవటానికి ప్రయత్నంచేయండి, ఎవరోవచ్చి ఉద్ధరిస్తారని ఎదురుచూడవద్దు. పని నిర్మలంగా చేయండి. ఎదురుచూసినట్లు చేయవద్దు, ఫలితం ఆశించకుండా చేసినది బంధించదు. ఆశించి పనిచేస్తే అది బంధిస్తుంది. కర్మఫలం ఆశిస్తే బుద్ధి కలుషితం అవుతుంది. నీ జీవితంలో అడగకుండా ఏదైతే వస్తుందో దానితోటి నువ్వు సంతృప్తి పడతావనుకో అది భక్తుడి లక్షణం. ఏదైనా ఒక వ్యక్తిమీద గాని స్థలంమీద గాని మమకారం పెట్టుకోవద్దు. మమకారం వలన బెంగవస్తుంది, అది నిన్ను బంధిస్తుంది. నీ దేహప్రారబ్దాన్ని బట్టి నీవంతుకు వచ్చేది ఏదో వస్తుంది. దానితో నీవు సంతృప్తి పడవు అనుకో లోకం అంతా నీకు వ్రాసి ఇచ్చినా సంతృప్తి పొందలేవు. భగవంతుడు ఏమి చెపుతున్నాడు అంటే మీరు చేసేపని ఏమిటి అంటే నాకు శరణాగతి చెందండి, నేను చేసే పని ఏమిటి అంటే మీలో ఎన్ని పాపాలు ఉన్నా, ఎన్ని లోపాలు ఉన్నా, ఎన్ని బలహీనతలు ఉన్నావాటిలోనుండిమిమ్మల్ని విడుదలచేసి మీకు శాశ్వతమైనశాంతిని ప్రసాదిస్తాను అని చెపుతున్నాడు. నీకు ఏమి చేతకాదు అనుకో కంగారుపడకు నీకు ఉపాయం కూడా నేనే, నీవు పొందవలసినది కూడా నన్నే అని చెపుతున్నాడు. మీకు ఎవరూ బంధువులు లేరుఅనుకోండి, మాకు బంధువులు లేరు అనుకోవద్దు. దేవుడికి మించిన పెద్ద బంధువు ఎవరూ లేరు. ఏదిక్కులేని వారికి దేవుడే దిక్కు. భగవంతుడిపట్ల సజీవమైన విశ్వాసం ఉంటే భగవంతుని సంకల్పాన్ని ప్రశ్నించటం కాదు, ఆయన సంకల్పానికి శరణాగతి చెందు, మాయలోనుండి బయటకు వచ్చేస్తావు, ప్రకృతిని దాటి వెళ్ళిపోతావు, మోక్షాన్ని పొందుతావు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 10 టు 17-01-2003 | | క్యాంపు |
| 21-01-2003 | మంగళవారం | మలికిపురం సాయిబాబా మందిరం |
| 26-01-2003 | ఆదివారం | జిన్నూరు రమణక్షేత్రం |




భగవాన్ శ్రీ రమణమహర్షి జయంతి మహోత్సవంలో సద్గురు శ్రీనాన్నగారు



భగవాన్ శ్రీ రమణమహర్షి జయంతి మహోత్సవం సందర్భంగా జిన్నూరులో శ్రీరమణ క్షేత్రం కమిటీ వారిచే సద్గురు శ్రీ నాన్నగారికి సన్మానం





పూలపల్లి జద్దు బ్రహ్మజీ గారి మిల్లులో శ్రీజయలక్ష్మీదేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు



అవిష్కరణ అనంతరం ప్రవచిస్తున్న సద్గురు శ్రీనాన్నగారు